స్వచ్ఛతా హీ సేవాలో అందరూ భాగస్వామ్యం కావాలి



కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

లాలాపేట: పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి పాల్గొన్నారు. గురువారం మాణికేశ్వర్‌నగర్, ఇప్లూ తదితర ప్రాంతాల్లో స్థానికులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతకు అందరూ శ్రమదానం చేయాలనీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలన్నారు.

పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సన్మానం



లాలాపేట: తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ సలహాదారుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పోచారం శ్రీనివాస్ రెడ్డిని గురువారం గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్, సొదాని భూమన్న యాదవ్ తదితరులున్నారు.

ప్రైవేటు అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి టీఎల్ఎఫ్

సనత్‌నగర్: రాష్ట్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై ప్రభుత్వ పెద్దలతో చర్చించి పరిష్కరించడానికి తెలంగాణ లెక్చరర్స్ ఫోరం (టీఎల్ఎఫ్) కృషి చేస్తుందని రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి స్పష్టం చేశారు. టీఎల్ఎఫ్ ఎస్ఆర్‌నగర్ డివిజన్ సమావేశం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మార్కండేయ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ అధ్యాపకులకు సముచితమైన వేతనం, ఆరోగ్య కార్డులు, ఉద్యోగ భద్రతను కల్పించడానికి టీఎల్ఎఫ్ పోరాడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో తీసుకురావలసిన మార్పులపై కూడా మరింతగా అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, మహేందర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా ఈ సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహేందర్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బీజేపీ నేతలపై ఫిర్యాదు



తుకారాంగేట్ ఎస్ఐ కిరణ్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అడ్డగుట్ట: కాంగ్రెస్ పార్టీ అధినేత, ఎంపీ రాహుల్ గాంధీపై బీజేపీ నేతలు చేసిన అనుచిత వ్యాఖలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదం సృజన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం, సృజన్ మాట్లాడుతూ శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్, యూనియన్ మినిస్టర్ రవ్‌నీత్ సింగ్ బిట్టు, యూపీ మంత్రి రఘురాజ్ సింగ్‌లు కాంగ్రెస్ అధినేత, ఎంపి రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్, హరి, మహేందర్, కోటి పాల్గొన్నారు.

ఎంబీఏలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్: బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (క్రిస్టియన్ మైనారిటీ) 2024–25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ ప్రోగ్రాంలో కేటగిరి 'బీ' అడ్మిషన్ల కోసం అర్హులైన అభ్యర్థుల ఉంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా టీజీసీహెచ్ఈ ద్వారా తెలియజేయబడిన అర్హత అవసరాలను పూర్తి చేయాలన్నారు.

మహారాష్ట్ర ఎమ్మెల్యేపై ఫిర్యాదు



సికింద్రాబాద్ : కాంగ్రెస్ పార్టీ అగ్రనేతపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మహారాష్ట్ర ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీపీసీసీ లీగల్ సెల్ నాయకులు క్రిష్ణరాజ్ చౌహాన్, బండ తరుణ్, రాజేంద్ర సింగ్, విజయ్‌కుమార్ తదితరులు నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోలీసులకే బెదిరింపులు

- లా అండ్ ఆర్డర్ పోలీసులకు ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు
- రెచ్చిపోతున్న అక్రమ వ్యాపారులు



నేషనల్ హైవే -44 మార్గంలో వెలిసిన అక్రమ దుకాణాలు

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.. కంటోన్మెంట్ బోర్డు అనుమతుల్లేకుండానే చేపట్టిన అక్రమ నిర్మాణాలు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.. జాతీయ రహదారిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందంటూ ప్రశ్నించిన పోలీసులనే బెదిరిస్తున్నారు! దీంతో ఆయా వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఏకంగా ట్రాఫిక్ పోలీసులు, లా అండర్ ఆర్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ, కంటోన్మెంట్ బోర్డు అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఆయా అక్రమ వ్యాపారాల కారణంగా హైవేలో ప్రమాదాలు పెరిగాయని, చర్యలు తీసుకునేందుకు యత్నించిన తమనే బెదిరిస్తున్నారంటూ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పిర్యాదులో పేర్కొనడం గమనార్హం.

అసలేం జరిగిందంటే?

జాతీయ రహదారి ఎన్‌హెచ్ -44పై బోయిన్‌పల్లి చెక్ పోస్టు నుంచి సుచిత్ర వెళ్లే మార్గంలో ఫుట్‌పాత్‌ను ఆనుకుని ఇటీవల పలు అక్రమ షెడ్‌లు వెలిశాయి. ఆయా షెడ్‌లలో పలు దుకాణాలు వెలిశాయి. దీంతో ఆయా షాపుల్లోనికి వెళ్లే వినియోగదారులు రోడ్డుమీదే వాహనాలు నిలిపి షాపుల్లోకి వెళ్తున్నారు. కొన్ని దుకాణాలు ఏకంగా ఫుట్‌పాత్‌లపైకి చొచ్చుకుని వచ్చాయి. ఈ నేపథ్యంలో రహదారిపై ట్రాఫిక్ జామ్ పరిపాటిగా మారింది. దీంతో బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వి.నాగయ్య ఆధ్వర్యంలో గత జులై 15న చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలో ఆయా దుకాణాల నిర్వాహకులు పోలీసులపైనే తిరగబడ్డారు. తమ యజమాని అడ్వొకేట్ అని చెబుతూ ట్రాఫిక్ పోలీసులను బెదిరించారు! పరిస్థితి చేయిదాటిపోతోందని గ్రహించిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సదరు దుకాణ యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు, రోడ్డుపై అడ్డదిడ్డంగా పార్కింగ్‌కు సంబంధించిన ఫోటోలను సైతం ఫిర్యాదులో జతచేర్చారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నామని బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు. ఆయా దుకాణాల నిర్మాణం, ట్రేడ్‌లైసెన్సు వంటి అంశాలు కంటోన్మెంట్ బోర్డు పరిధిలోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు బోర్డు ఉన్నతాధికారులకు సైతం సమాచారం ఇస్తామన్నారు.

చర్యలు చేపడతాం

దేవేందర్, హెల్త్ సూపరింటెండెంట్

కంటోన్మెంట్ పరిధిలో ఫుట్‌పాత్‌లు, రక్షణ భూములను ఆక్రమించి చేపడుతున్న వ్యాపారాలపై చర్యలు చేపడుతున్నాం. జాతీయ రహదారిపై అక్రమ దుకాణాల అంశం ఇటీవల మా దృష్టికి వచ్చింది. ఈ దుకాణాలకు బోర్డు నుంచి ఎలాంటి ట్రేడ్ లైసెన్సులు జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, వాటిపై చర్యలు తీసుకుంటాం.

ఎమ్మెల్యే శ్రీగణేశ్ సోదరి హఠాన్మరణం

- జన్మదినం నాడే మృతి



విజయకుమారి (ఫైల్)

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీగణేష్ ఇంట విషాదం చోటుచేసుకుంది. బుధవారం ఆయన సోదరి విజయ కుమారి గుండెపోటుతో మరణించారు. శ్రీగణేశ్‌కు ఐదుగురు సోదరులు, ఇద్దరు అక్కలు కాగా, పెద్ద అక్క విజయకుమారి (52) మరణం ఆ ఇంట విషాదఛాయలు నింపింది. శ్రీగణేశ్ సమీప బంధువు ఇటీవల మరణించగా, బుధవారం మృతుడి కుటుంబాన్ని ఓదార్చేందుకు ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో పాటు సోదరి విజయకుమారి ఇతర కుటుంబ సభ్యులు కలిసి వెళ్లారు. బుధవారం రాత్రి తిరుగు ప్రయాణంలో తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయం వద్దకు రాగానే, కారులోనే విజయకుమారి అస్వస్థతకు గురయ్యారు. రోడ్డుపక్కన కారు ఆపి కుటుంబ సభ్యులు ఆమెను సమీపించి మాట్లాడుతుండగానే ఒక్కసారిగి కుప్పకూలిపోయారు. స్థానికంగా ఉండే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మరణించినట్లు డాక్టర్‌లు ధ్రువీకరించారు. బుధవారం విజయకుమారి జన్మదినం కావడంతో మరికాసేపట్లో కుటుంబ సభ్యులంతా కలిసి ఘనంగా ఆమె జన్మదిన వేడుకలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. ఇంతలోనే ఆమె మృతి చెందడంతో తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. గురువారం మెట్టుగూడలోని సెయింట్ ఆంథోనీస్ చర్చిలో ప్రార్థనల అనంతరం బోయిగూడలోని క్యాథలిక్ సిమెట్రీలో విజయకుమారి అంత్యక్రియలు నిర్వహించారు. కంటోన్మెంట్‌తో పాటు నగర పరిధిలోని పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, శ్రీగణేశ్ బంధుమిత్రులు ఆయనను పరామర్శించారు.

త్వరలో పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం



సీతాఫల్‌మండిలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రహదారులు, పైప్‌లైన్ పనుల నిర్మాణం పనులను త్వరలో ప్రారంభించనున్నట్టు కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. గురువారం నామాలగుండులో రూ.1.90 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న వార్డు కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే భవన నిర్మాణం పూర్తి చేసి కొత్త భవనం ద్వారా వార్డు కార్యాలయ సేవలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. అనంతరం బీదలబస్తీ, ఏక్ నెంబర్ గల్లిలో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, స్థానిక నాయకులు చందర్, మహేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలతో దేశాభివృద్ధి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న చంద్రశేఖర్ తివారి

లాలాపేట: జమిలి ఎన్నికలు దేశాభివృద్ధికి దోహదపడతాయని భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ తివారి అన్నారు. గురువారం సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం తార్నాక విజయపురి కాలనీలో ఆర్కిటెక్ట్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటికీ బీజేపి సభ్యత్వ నమోదులో ఆయన జిల్లా కార్యదర్శి మేకల సారంగపాణితో కలిసి ముఖ్యతిథిగా పాల్గొన్నారు. పలువురి ఇండ్లకు వెళ్లి స్వయంగా డిజిటల్ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ తివారి మాట్లాడుతూ జమిలీ ఎన్నికలపై ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనకట్ల హరి, జయశ్రీ,శారదా మల్లేష్,మహేశ్, రాజేష్,శ్రీనివాస్, కుమార్, సతీష్, నాగేందర్, ప్రతాప్, కృష్ణ, తేజ తదితరులున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ జె. వెంకటి



రోగులను పరీక్షిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి

రసూల్‌పురా: పట్టణ ప్రాథామిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె. వెంకటి ఆదేశించారు. గురువారం రసూల్‌పురా, సీబీఎస్ నగర్‌లోని బస్తీ దవఖానాలను తనిఖీ చేశారు. అనంతరం స్వయంగా రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రత పాటించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయమాలిని, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర రుక్మారెడ్డి, డాక్టర్ ఆశ్రీత పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు ఉద్యోగుల భారీ ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్

రాంగోపాల్‌పేట్: యూనియన్ బ్యాంకు యాజమాన్యం బాధ్యతారాహిత్య, ఉద్యోగ వ్యతిరేక వైఖరిని విడనాడాలని ఆలిండియా యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ ఫెడరేషన్ (ఏఐయూబీఓఎఫ్), ఆలిండియా యూనియన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐయూబీఈఏ) నేతలు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం యూనియన్ బ్యాంక్ ఉద్యోగ వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ ఎస్డీ రోడ్డులోని యూనియన్ బ్యాంకు రీజనల్ కార్యాలయం ముందు వందలాది మంది ఉద్యోగులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఏఐయూబీఈఏ వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు ఎండీ, సీఈవో, ఈడీ (హెచ్ఆర్)తో సహా బ్యాంక్ యాజమాన్యం మొత్తం బ్యాంకు ఉద్యోగులను బెదిరించడం, నిబంధనలు ఉల్లంఘించే చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ అవార్డ్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమద్ ఖాన్, యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ రాజు తదితరులు పాల్గొన్నారు.

టీటీఐపై దాడి

అడ్డగుట్ట: పాత గొడవలను మనసులో పెట్టుకొని ఒంటరిగా వెళ్తున్న రైల్వే టీటీఐపై ఓ రైల్వే ఉద్యోగి మరో ఇద్దరితో కలిసి దాడి చేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం...మహేంద్రాహిల్స్‌లోని అన్నపూర్ణ సొసైటీకి చెందిన రమేష్ బాబు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల సికింద్రాబాద్ నుంచి కాజీపేటకు వెళ్తున్న ఒక ఎక్స్‌ప్రెస్ రైలులో టీటీఐ రమేష్ విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రైల్వే ఉద్యోగి నరేష్‌తో పాటు మరో ఇద్దరు సదరు రైలులోని ఏసీ బోగీలో కూర్చున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన టీటీఐ రమేష్ ఆ ముగ్గురు వ్యక్తులను టికెట్ అడగడంతో వారు రైల్వే ఉద్యోగులం అని ఐడీ కార్డు చూపించారు. అయితే, ఉద్యోగులు ఏసీ బోగీలో కూర్చోవద్దని, స్లీపర్ క్లాస్‌లో వెళ్లి కూర్చోవాలని వారికి చెప్పారు. ఈ క్రమంలో మాటా మాటా పెరిగి గొడవకు దారి తీసింది. ఇది మనస్సులో పెట్టుకున్న నరేష్ మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి బుధవారం ఉదయం 6 గంటల సమయంలో డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్తున్న టీటీఐ రమేష్‌బాబును ఈస్ట్‌మారేడుపల్లి టీచర్స్ కాలనీలోని సీఎస్ఐ ఇన్స్టిట్యూట్ వద్ద అడ్డగించాడు. అప్పటికప్పుడు తనతో తెచ్చుకున్న ఒక సెంట్రిగ్ కర్రతో రమేష్ బాబుపై దాడి చేసి వెళ్లిపోయారు. వెంటనే బాధితుడు స్థానిక తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతన్ని చికిత్స నిమిత్త మెట్టుగూడలోని రైల్వే ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయం కావడంతో కుట్లు వెసినట్లు తెలిపారు.

విద్యార్థులకు స్కూల్‌కిట్లు పంపిణీ



విద్యార్థులకు స్కూల్‌కిట్లు అందిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

చిలకలగూడ : మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో వెస్ట్‌మారేడుపల్లి లయన్స్‌క్లబ్ ప్రతినిధులు విద్యార్థులకు స్కూలు కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఉత్తమ లక్ష్యాలను అధిగమించేందుకు ఇప్పటి నుంచే క్రమశిక్షణతో మెలగాలని, ఉన్నత శిఖరాలు చేరుకోవాలంటే కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని, చదువుకున్న పాఠశాల, విద్యాబుద్దులు నేర్పిన గురువులు, కుటుంబసభ్యులకు సమాజంలో మంచి పేరుతెచ్చేందుకు కృషి చేయాలని లయన్స్ క్లబ్ ప్రతినిధులు విద్యార్థులకు సూచించారు. దూద్‌బావి పాఠశాల హెచ్ఎం మల్లిఖార్జునరెడ్డి, అధ్యాపకులు హసినాబేగం, నాగశ్రుతి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



కంటోన్మెంట్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అయ్యూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో గురువారం పలువురు నాయకులు ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి పుష్పాగుచ్ఛం అందజేసి సన్మానించారు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీని మరింతా బలోపేతం చేయాలని వేం నరేందర్‌రెడ్డి సూచించినట్లు అయూబ్‌ఖాన్ వెల్లడించారు.

– సాక్షి, సిటీబ్యూరో

బీజేపీ నేత అశోక్‌కు నేతల నివాళి



అశోక్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: బీజేపీ మోండా డివిజన్ అధ్యక్షులు అశోక్ మృతితో స్థానికంగా విషాదఛాయలు నెలకొన్నాయి. టకారబస్తీలోని ఆయన భౌతికకాయాన్ని ఆయా పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపికానరేష్ తదితరులు అశోక్ భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అశోక్ కుమారుడు వినయ్‌తో ఫోన్‌లో మాట్లాడి తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు. గురువారం బన్సీలాల్‌పేట్ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



చిలకలగూడలో మిలాద్ ర్యాలీ దృశ్యం

సనత్‌నగర్: నియోజకవర్గంలో మిలాద్ ఉన్ నబి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే ఈ పండుగలో భాగంగా మస్లిం సోదరులు ఉదయాన్నే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరుకొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలుచోట్ల ఊరేగింపులు జరిపారు. ఇళ్లల్లో ప్రత్యేక వంటకాలు చేసి పరస్పరం పంచుకుని సోదర భావాన్ని చాటారు. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రవక్త బోధనలను వినిపించారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో పలుచోట్ల జరిగిన మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ హాజరై ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



మిలాద్ ఉన్ నబి వేడుకల్లో కోట నీలిమ..

బేగంపేటలో...

బేగంపేట పాటిగడ్డలో సీనియర్ నాయకులు మొహిన్‌భాయ్ ఆధ్వర్యంలో జరిగిన మిలాద్ ఉన్ నబీ వేడుకలకు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు షేక్‌గౌస్, యువనేత అడపా అభిషేక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని స్వీట్స్ తినిపించుకున్నారు.



బేగంపేటలో జరిగిన వేడుకల్లో అభిషేక్ అడపా, షేక్‌గౌస్..

చిలకలగూడ : ముస్లిం నాయకులు మత పెద్దల నేతృత్వంలో వారాసిగూడ, మొరంబండ, పద్మారావునగర్, నైవేద్యం హోటల్, చిలకలగూడ చౌరస్తా, గాంధీ స్టాట్యూ, మైలార్‌గడ్డ, సీతాఫల్‌మండి, నామాల గుండు మీదుగా మిలాద్ ర్యాలీ కొనసాగింది. చిలకలగూడ సీఐ అనుదీప్ నేతృత్వంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.